# అన్నదమ్ములు

(కథానిక)

ఆఫీసులోని గడియారం టంగున అయిదు గంటలు కొట్టడం, బయట వరండాలో బూట్లు నడిచిన చప్పుడు కావడం, తలుపులు కిర్రుమంటూ మూయబడడం గరుడాచలంలో కొంత సంచలనాన్ని కలిగించాయి. దరిగానని ఆలోచనా ప్రవాహంలోపడి సతమతమవుతున్న అతడు—స్థలం మారిస్తే ఏదన్నా కొత్త రిలీఫ్ వుంటుందని తలచి కుర్చీని వెనక్కుతోసి లేచాడు. సిరామరకలు కాగితాల కట్టలతో నిండిన టేబిలు అతని ముందు భూతంలా నిలబడివుంది. కాగితాలు సర్ది వాకిటి వైపు నడిచాడు. మురిగ్గావున్న గుడ్డపేలికను భుజంపైవేసుకొని వాకిలిపద్ద కునికిపాట్లు పడుతున్నాడు ఆఫీసు ప్యూను. "నల్లమందు డోసేసివుంటాడు ముసలిపీనుగ. మురికి పేలికలు వీడు" వాణ్ణి పలకరించటానికి అసహ్యంతోచి వరండా మెట్లు దిగసాగాడు. చేతులకు సంకెళ్లు తగిలించిన యిద్దరుఖైదీలను పోలీసులు తుపాకులు బారుచేసి తీసుకపోతున్నారు. వారి మాడిన డొక్కలకింద మురికిగుడ్డలు పీలికలై వేలాడుతున్నయ్. ఎర్రటి దుమ్ముతో ఆపాదమస్తకం కప్పుకొని ప్రాణంలేని నీడల్లా పోలీసుల వెంట పోతున్నారు. "దొంగ వెధవలు, పట్టుపడ్డారు కాబోలు" జేబీలోని పర్సు చూచుకున్నాడు గరుడాచలం. తాలూకాఫీసు గేటు దాటి జట్కాయెక్కమని ఆహ్వానించే బాడుగబండివాళ్లని తప్పించుకొని రోడ్డు అంచున గబగబ అడుగులువేస్తూ నడవసాగాడు. రోడ్డున నడిచే అసంఖ్యాక ప్రజా సమూహాన్ని దుమ్ముతో అభిషేకంచేస్తూ లారీలు, బస్సులు, కార్లు అతివేగంగా పోతున్నయ్. పేలికలైన మురికిగుడ్డలతో అర్థనగ్న దేహులై అతనిపక్క నడిచే దౌర్భాగ్యులైన స్త్రీ పురుషులని అసహ్యంగా చూస్తూ, అందంగా ముస్తాబై జాస్మిన్ అత్తరును గుప్పుమనిపిస్తూ కార్లల్లో రివ్వున పోయే స్త్రీపురుషులనిచూసి అసూయపడుతూ, గరుడాచలం నడుస్తూ వూహించసాగాడు: "ఎంత తేడా? రెక్కలాడితేనేగాని డొక్కలు నిండని యీ అభాగ్యులు పేలికల్తో మురికితో దుమ్ముతో దరిద్రంతో ఆకలితో రోగాల్తో బ్రతుకే భారంగా జీవయాత్ర గడుపుతుండగా కార్లలో తిరిగే యీ పెద్ద మనుషులు సోమరితనం గర్వం అహంభావం విలాసాలతో పొద్దుపుచ్చటం! యిదే నేటి సామాజిక వ్యవస్థ. ఎంత ఘోరం!" హోటలుదాటి నాలుగు గజాలు పోయి తన తప్పు తెలుసుకొని వెనక్కిమళ్లాడు. హోటలు, మనుషులతో పొగతో యీగలతో కిక్కిరిసివుంది. యీగలు బజ్ మంటూ రేడియో సంగీతానికి పైపాటపాడుతున్నయ్. గ్లాసుల గలగల ప్లేటుల దబదబలతో చెవులు గింగురమంటున్నయ్. గరుడాచలం కాఫీతాగి బిల్లు చెల్లించి బైటికొచ్చాడు. "కానీ యీ బాబూ" అరడజను బిచ్చగాళ్లు అతన్ని చుట్టుముట్టారు. వాళ్లలో పిల్లలు, వృద్ధులు, బాలింతలు స్త్రీలు, పురుషులు వున్నారు. "ఛా ఛా! ఏమిటీ ఘోరం? ఎక్కడబట్టినా ఆకలి, దరిద్రం, రోగాలు. మురికి పేలికలు." అనుకుంటూ వారిని వదలించుకొని ఫుట్ పాత్ మీద నడవసాగాడు. "ఏమిటీ సృష్టి! ఎంత అధ్వానంగా వుంది? మానవుని కనీస అవసరాలే సమకూర్చలేక పోయింది. ఎంత ఘోరం." సృష్టిపై నిందనంతా మోపి నిశ్చింతగా వుండదలచిన ఆ మానవుడికి గోపాల్ మాటలు జ్ఞప్తికి వచ్చినయ్. "ఇది సృష్టియొక్క లోపంకాదు. నేడు పెత్తనం చేసే సమాజ పెద్దల స్వార్థప్రియత్వం. దరిద్రం వుంటేగాని వారి ఐశ్వర్యం వుండదు, గోతులుంటేనే మిట్టలుంటే అవకాశమున్నట్లు" కానిగోపాల్ కమ్యూనిస్టువాడు

"పరంధామయ్య"

గనక తన్ను హిప్నటైజ్ చేస్తున్నాడా యేం కొంప తీసి? లేకుంటే ఎన్నడూ లేనిది ఏమిటీ వూహాలు? గరుడాచలం భయంతో వణికి ఆ వూహాలనుంచి విముక్తి చెందాలనే వుద్దేశంతో చుట్టు పక్కలకు దృష్టి సారించాడు. రోడ్డు నుంచి చీలి తన యింటివైపుకు దారితీసే ఇరుకు సందు కనబడ్డటి. ఆ దారినే యిరవై గజాలు పోతేగాని తన యిల్లు రాదు. దుమ్ము, చెత్త, చెదారం నానా భీభత్సంగా వుంది. ఆ దారికి యిరు వైపులుండే గృహస్థులంతా తమ కవసరంలేని పదార్థాలను ఆ సందులోకే తోసేస్తూ వుంటారు. ఆ చెత్తంతా సైడ్ కాలవ వుపరి భాగాన తేలిపోతూ తమతో తీసుకుపోలేని ఘన పదార్థాలతో కాలవని మిశ్రు చేస్తూ వుంటుంది. అప్పుడప్పుడు ఆ చెత్త కుప్పలు కుప్పలుగా పడటం సైడ్ కాలవలోని మురికి నీటి ప్రవాహం కాలువ అంచులు దాటి రోడ్డు మీదికి నడవటం ఆ సమయంలో ఆ దారిని పోయే స్త్రీ పురుషులు తమతమ కోకల్ని పంచల్ని యెత్తుకొని ముఖం చిట్లించుకుంటూ వెళ్ళటం మామూలు. గరుడాచలం యెంతో కాలంనుంచి పరిచయమైన ఆ ఇరుకు సందులో ప్రవేశించగానే మురికి వాసనను మోసుకొచ్చే వేడిగాలి అతని ముక్కులో దూరి కలత పెట్టింది. చేతిగుడ్డతో ముక్కును గట్టిగా పట్టుకొని వేగంగా నడవసాగాడు. అతని కాళ్ల చప్పుడుకు బెదిరిన ఈగలంతా బజ్ మంటూ లేచి నూతన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నయ్. గరుడాచలం "అబ్బే" అన్నట్టు ముఖం పెట్టి "ఇంత మురికి సందుల్లో, గొందుల్లో, కొంపల్లో గాలిలో, నీళ్ళలో సర్వాంతర్యామి వలె వ్యాపించివుంటె ఎక్కడ భరించను" అనుకొని మూడంగలలో సందుదాటి యింట్లో దూరాడు.

ఈజీచేరులో కూలబడి సిగరెట్టు ముట్టించాడు. ఆనాటి వుదయం తన భార్యతో ఘర్షణపడిన విషయం జ్ఞాపకం వచ్చింది. పొద్దుటినుండి తెంపులేకుండా ఆలోచించినా, ఆ సమస్యను పరిష్కరించే వుపాయం కనబడలేదు. గరుడాచలానికి విసుగు జాస్తయింది. గాలి స్థంభించిందేమో వుక్కపోయటం ప్రారంభించింది. చొక్కా గుండీలు వూడదీస్తూ "నాకు తగ్గట్టే చిక్కింది వెధవ కొంప. చీకటి కొట్టున్నా నయం. ఈ పాడు కొంపకే ముఫ్ఫయి రూపాయలు దర్శించాల సొచ్చె. కిటికీ తెరుస్తామా అంటే ముక్కలు బద్దలుకొట్టే దుర్వాసన. ఫ్యాన్ అన్నా కొందామంటే యెప్పటి కప్పుడు సరిపోతూ లే వుంది. ఇక దాని సవాళ్లు చూస్తామా అంటే కోటలు దాటి పోతుంటయ్. అయినా దానిది మాత్రం ఏం తప్పుంది మన అసమర్థతగాని. యీడొచ్చిన కూతురిని ఇంట్లో పెట్టుకొంటె ఏ తల్లికిమాత్రం బాధగావుండదు. అట్లని సాధక బాధకాలు విచారించకుండా పిచ్చి కుక్క మాదిరి పైన బడితే? నాకుమాత్రం అమ్మాయికి పెళ్ళిచేయటమంటె యిష్టం లేదూ?" గరుడాచలం అలిసి పోయాడు. తల భారంగా వుంది. మరలా కాఫీ తాగితే బాగుండు ననిపించింది. ఆశతో వాకిలివైపు చూశాడు. సిగరెట్టు బిర్రుగా పీల్చి పొగ వదిలాడు. ఇంతలో గజలక్ష్మమ్మ వస్తున్నట్టు కాలి చప్పుడయింది. కాఫీ గ్లాసుతో వచ్చే భార్యను చూడగానే అతని మనస్సు స్థిమితపడ్డది.

"కాఫీఅన్నా తీసుకోండి" అందమైన గజలక్ష్మమ్మ మొఖం చూడగానే అతనికి గిలిగింతలు పెట్టినట్లయింది.

"ఎందుకు మరలా వురుములు మెరుములు జడివాన కురిపించటానికా?"

"సరే, మీయిష్టం. అయినా మీ మాదిరి ముడుచుకపోవటం నాకు తెలియదుగా. ఇంతకు కాఫీమీదనా నామీదనా కోపం?" గజలక్ష్మమ్మ పెదవులపై హాసరేఖ వుదయించింది. గరుడాచలం ప్రేమతో భార్యవైపు చూస్తూ గ్లాసులోని ఆఖరి కాఫీ చుక్కను సైతం గజలక్ష్మమ్మ అధరామృతాన్ని గ్రోలినట్లే చప్పరించాడు.

ఇంతలో వారి పెద్దకూతురు హేమ "అమ్మా చాకలి వచ్చిందే. గుడ్డల లెక్క యెక్కడుంది?" అంటూ వాకిలివద్దకు వచ్చింది. "వస్తున్నానే అరమరలోచూడు" గజలక్ష్మమ్మ పోవటానికి ఒకఅడుగు వాకిలిదగ్గర కేసింది. గరుడాచలం కళ్లు అమితమైన వాంఛతో సగం మూసుకున్నయ్. అతని చేతు లామె నడు

మును చుట్టుముట్టి పెదవులామె అధరాన్ని చుంబించగా- గజలక్షమ్మ తొట్రుపాటుతో ఉస్ అంటూ అతని చేతులను సవిలాసంగా తప్పించుకొని బయటపడ్డది. ఇంతలో బయట ఎవరో "అయ్యగారున్నారా" అనటం గరుడాచలం ఆ గొంతు గుర్తుపట్టి లోపలికి రమ్మనటం, జరిగిపోయింది.

"ఏం, పంతులూ హడావిడిగా వచ్చావే"

"మరేం లేదు. మీతో మాట్లాడి పోదామని" పంతులు తన కొంగమెడను మరికొంచెం సాచి అన్నాడు.

"పరిస్థితులు చూస్తుంటే నిరుటిమాదిరి సాఫీగా పొయ్యేట్టు లేదే?"

"ఆ! వాళ్ళ మొహం లెండి. మనదగ్గిర పర్మిటు వుందిగా."

"నువ్వింకా పిచ్చిన పడుతున్నావే. వాళ్లు చెకింగు పవరు కావాలని కలెక్టరును అడిగారట."

"చెకింగు పవరా? బయలుదేరే ప్రతిలారీ చూస్తారటనా. అయితే యేంలే. నేను సర్దుబాటు చేస్తానుగా."

"ఇంకా వారికి ఆ పవరు యివ్వలేదులే. అవతల ఆలోచిస్తాం పరిస్థితులను బట్టి. కాని నిరుటి మాదిరి పదిరూపాయలకు ఒప్పుకోవా అంటే నా వల్లకాదు. పెధవది బలే రిస్కు. నీకు తెలియందేముందిలే. పుట్టికి పదిహేను రూపాయలివ్వాలి. దానికొప్పుకుంటేనే."

"మీరలా మాట్లాడితే-"

"ఆ నసుగుళ్ళన్నీ నా దగ్గర పనికిరావు. నూరురూపాయలు మింగుతూ పదిహేను రూపాయలకి బలే గొణుగుతున్నావే."

"మీకొక్కరికా? వి.యమ్. కు మామూలు, లారి వాడికి, యిక మిగిలింది పదో పాతికో- అందులో హోల్ సేలరుకు మళ్ళా సగం."

"అయినా పర్వాలేదు లేవయ్యా. నీ మట్టసానికి ఒక్కగింజ ప్రాఫ్యూరుమెంటు కిచ్చావ్? ఆ కరణానికేదో కాస్త ముట్టజెప్పి మీరు బడా బడా ఆసాములంతా తేలిగ్గా తప్పించుకుంటూ దరిద్రుల మీదికి మమ్మల్ని పుసిగొల్పటం. నాకు తెలియదటయ్యా మీ మ్యాజిక్." నవ్వసాగాడు గరుడాచలం.

"అబ్బెబ్బె! అంత మరీ అమానుషం వుంటుందా? మాకుమాత్రం పాపభీతి లేమా"

"సరే. మీపాప భీతి సంగతి నాకెందుకుగాని, నేను చెప్పానే ఆ బ్యాగ్స్ విషయం, ఏంజేశావ్?"

"రెడీ. మీరు చెప్పటమూను, దానికి తిరుగుడు కూడా నా?"

"ఎన్ని?"

"పదిహేనుకదండి."

"ఆ. అసాధ్యుడివయ్యా. దాంట్లో మీకెంత కుంభకోణం."

"దేంట్లో, బ్యాగ్స్‌లోనా. అబ్బె, వొట్టు. మాకెందుకండి."

"సరే, ఆ బ్యాగ్స్ త్వరలో వచ్చేట్టు చెయ్యి. బియ్యానికి నానా తంటాలుగా వుంది. సరే యిప్పుడెన్ని బస్తాలు ప్రొక్యూరయి వుంటేది."

"నూట యిరవై బస్తాలు."

"సరే రేపొక నూట పది బస్తాలకు పర్మిటు తీసుకొని అవి కూడా రేపే చేర్చు. ఏమిటవి? ఆ పదిహేను కూడా."

"సరే, అలాగే. మీ మాట ఎప్పుడు కాదన్నామండి."

"ఏమిటో మీ వూళ్ళో మరీ కాకి గోల పెడుతున్నారయ్యా, వాళ్ళ తాకదంతా ముంచుకపోయినట్లు."

"కానీండి. మీరు మనసున బెట్టాలేగాని, దానివల్ల ధూపం తెగుతుంది."

"సరేగాని రెడ్డిగారు వూళ్ళో వున్నారా?"

"అబ్బె వారి విషయం అలా కచ్చితంగా వుంటారని చెప్పటానికి ఏమాత్రం వీలులేదండి. వారి కదొక సర్దా. ఎద్దులు, గుర్రాలు, కార్లు. ఫస్టుక్లాసైన కారుంది కదా? మరలా ఎద్దుబండి ఒకటి, గుర్రంబండ్లు రెండు. వారి కదో పిచ్చి. అయినా వారు శ్రీమంతులు."

"వారి హోల్ సేల్ బిజినెస్ అంతా నువ్వే చూసుకుంటావా."

"మరేమిటనుకున్నారు. ఈ విషయంలోనే కాదు, మరే విషయంలో కూడా వారు పట్టించుకోరు. వారి సర్దాయేమో వారేమో. అయితే ఏం, వారికి నామీద పరిపూర్ణమైన నమ్మకం

వుంది. నా విషయం నే చెప్పకూడదు కాని, ఆణా పైసలతోటి కచ్చితంగా వుంటావండి"

"అప్పనే ఒకరి వుప్పు పులుసు తింటూ వారికే ద్రోహం చేయటం"

"చూడండి. యీ తనువులు శాశ్వతంగావు. కాని శాశ్వతమైనటువంటి ఆ ధర్మ మున్నదే, దానికి భంగం కలుగకుండా ఏదో యీ జీవిత శేషాన్ని గడుపుకొంటినా, అంతకన్న నాకు కావలసిం దేముంది?"

"అరె! నీకు ధర్మచింత కూడా వున్నదే. మానవు డెప్పుడూ తన దుర్బలత్వాన్ని కప్పి పుచ్చటానికి ధర్మాలని వల్లిస్తా డనుకుంటాను. నువ్వేమంటావు."

"అఁ తమబోటి వారికి ధర్మోపన్యాసం చేయుటం నిజంగా సాహసమే. అయినా ధర్మ విరుద్ధమైన పనులంటే మాత్రం నాకు సుత రామూ గిట్టవు."

"పంతులూ నీవు పూర్తిగా పొరపాటు పడుతున్నావ్. ధర్మోపన్యాసాలు చేసే వాళ్ళ మన మెప్పుడో కోల్పోయాము. నీ మట్టసానికి నువ్వు ఎన్ని కొంపలు ముంచావో నాకు తెలుసు" మరింత వుద్రేకంతో-

"కాని నాకు దీంట్లో భాగం లేదు. నేను ధర్మాన్ని తప్పలేదు అంటున్నావు" ఇం తెందుకు నా సంగతి చూడు. నా వుద్యోగ ధర్మ మున్నదే దాని ప్రకారం నడవాలంటే అక్కడా "చోటు" కానగలిగే వాడినా? ఈ రెండు నెలలనుండి గోడలు లేవలేదంటే ప్రాక్ట్యారు ఇంటు ప్రారంభం కాకపోవటమే కారణం. ఈరోజు చూడు గోడలు లేచిపోతున్నాయ్. రేపు పొద్దుటికి కిటికీలు కూడా అమరుస్తారు. ఈ సంవత్సరం నా కుమార్తె వివాహం చేయాలి. మన దర్జాలేమీ తగ్గటానికి వీలులేకపోయె. ఏం జేస్తాం, రెండు చేతులతో గుంజినా ఈ పాడు జన్మకి తృప్తి లేకపోయెనే. ఇంత జేసినా ఆక వాళ్ళ దగ్గిర మనం అసమర్థులమే."

"చిత్తం చిత్తం. అనుభవించి చెప్పిన మాట"

"యీ సొద కేంగాని. ఆ నాయుడుదేం చేశావ్?"

"ఇదుగో తెచ్చారుగా. ఒక్క కాగితం."

"మిగతా?"

"రేపు యిస్తానన్నాడు లెండి."

"సరే నాకెందుకు. నీమీద రాబట్టుతా."

"అయ్యగారున్నారా" బయటనుండి కేక.

"రావయ్యా లోపలికి. పోస్టు ప్యూను కాదూ?"

"ఆ వాడే." పోస్టు జవాను జాబులు తెచ్చి యిచ్చి వెళ్ళాడు. ఒక జాబు చింపి చదివి, ఆశ్చర్యంతో, "ఏమిటండోయ్! నాకు ట్రాన్స్ఫర్. యిమిడియేట్ గా. ఎంత ఘోరం."

"ఆ ముంచేశారే" పంతులు గుండెల్లో ఆటం పేలింది.

"మన ఆట కట్టింది. పాపం చాలా కొని పెట్టావేం?"

"ఎనభైనాకా కొనుగోలు చేశాను. వచ్చే వారు?"

"ఎవరో ఒకరు ఏమైనా నీ వలలో పడకుండా-"

"అయ్యగారున్నారా?"

"ఉన్నారు-రావచ్చు."

"ఓహో మునసబుగారే!"

"పంతులుగారు కూడ యిక్కడేవున్నారే"

"ఏమిటోయ్. పరుగెత్తుకుంటూవచ్చావ్"

"ఏముంది. ఓడ మునిగింది. వాలంటీర్లకు చెకింగు పవరు యిచ్చారు."

"ఆఁ" పంతులు నోరు తెరిచి వికృతంగా గరుడాచలం వైపు చూశాడు.

"దీనికేదో వుపాయం చూడాలి,"

"వుపాయం లేదు, అంతా అపాయమే. అయ్యగారు కూడా ట్రాన్స్ఫరు"

"ఆ. ఏమిసార్, నిజమేనా?"

"నిజమే. యిదుగో ఆర్డరు. ఏంజేస్తాం."

"నా కొంప మునిగింది." పంతులు మూడు నిలువుల బావిలో నించి మాట్లాడినట్లు అన్నాడు.

